# ఇంటర్వ్యూ

"రేపే మన అమ్మాయిని చూడ్డానికి వస్తున్నారు వాళ్ళు" అన్నారు అప్పుడే వచ్చిన పరంధామయ్యగారు భార్యతో.

"ఇంతకీ వివరాలేమిటి? పెళ్ళికొడుకు ఏం చదువుకున్నాడు? కట్నం ఎంత? అబ్బాయి అందంగా వుంటాడా? అబ్బాయి పొడుగా? పొట్టా?" అంటూ ప్రశ్నలవర్షం కురిపించింది భార్య పార్వతమ్మ.

"అబ్బాయికేం? నిక్షేపంలా ఉంటాడు. బి. ఇ. పాస్ అయాడు. బుద్ధిమంతుడు అన్నివిధాలా మనకు తగిన సంబంధం" అన్నారు పరంధామయ్యగారు.

"అమ్మాయ్, రజనీ!" కూతుర్ని పిలిచింది పార్వతమ్మ. "రేపే వాళ్ళు నిన్ను చూడానికి వస్తున్నారు. నీకేం చదువుకున్నదానివి. నేనేం ప్రత్యేకంగా చెప్పనవసరం లేదనుకో. కాని ఏదో పెద్దదాన్ని. నా చాదస్తం నాది" అంటూ మర్నాడు పెళ్ళివారి దగ్గరెలా ఉండాలో బోధించి చెప్పింది పార్వతమ్మ.

పైకిమాత్రం తలూపినా, లోలోపల నవ్వుకుంది, మర్నాడు తాను చేయబోయే ఘనకార్యాన్ని తలుచుకుని రజని. మర్నాడంతా ఒకటే హడావుడిగా ఉన్నారంతా, ఇల్లంతా శుభ్రంగా ఉంచారు. అనుకున్న వేళకు పెళ్ళివారు అంటే పెళ్ళికొడుకు రమేష్, అతని తల్లి, తండ్రి విచ్చేశారు.

కుశల ప్రశ్నల అనంతరం కాఫీ, ఫలహారాలయ్యాయి. ఆ తర్వాత రజని వచ్చి కూర్చుంది.

వస్తూనే "ఊ" యిక ప్రారంభించండి మీ యింటర్వ్యూ అంది పెడసరంగా.

క్షణంపాటు ఆశ్చర్యపోయిన రమేష్, వెంటనే తేరుకుని. "ఆగండి, తొందరెందుకు" అన్నాడు ఏ మాత్రం తొణక్కుండా.

ఒక్కసారి రజనిని పరీక్షించి చూశాడు రమేష్, పొడుగుకు తగ్గలావు. నిండైన విగ్రహం. కొనతేలిన ముక్కు, పెద్దపెద్ద కళ్ళు, నుదుటిమీద పొడుగాటి బొట్టు, పొడుగాటి జడలో కనకాంబరాలు ఎంతో అందంగా ఉన్నాయి.

మిల మిల మెరసే పచ్చని శరీరచ్ఛాయకు కట్టుకున్న పసుపు రంగు పట్టుచీర, ఆకు పచ్చని జరీ అంచుతో మరింత అందాన్ని చేకూర్చింది. ఎడమ చేతికి పెద్ద స్క్వేర్ వాచి, కుడి చేతికి నాజూకుగా రెండే రెండు బంగారు గాజులు, మెడలో సన్నని ఒంటిపేట గొలుసు. వేరే ఫాషన్స్ ఏమీ లేవు. సింపుల్ క్రీచర్ అనుకున్నాడు మనస్సులో.

రజని నుంచి చూపులు మరల్చుకుని, "మీ పేరేమి టన్నారు? అడిగాడు రమేష్. "ఇంతవరకూ నేనేమీ అనలేదే" రజని సమాధానం.

"ఓ, అయామ్ సారీ, మీ పేరేమిటి?" మళ్ళీ అడిగాడు.

"ముందే తెలుసుగా? నా పేరేమిటో, అయినా నా నోటి నుండి వినాలనుండి కాబోలు, వినండి శ్రద్ధగా ర...జ...ని"

"థాంక్స్. మీరు గ్రాడ్యుయేట్ అని తెలుసును. కాని మీరు బి. ఎ. నా లేక బి. ఎస్‌సి. నా?" రమేశ్ ప్రశ్న.

"బి. ఎస్‌సి." రజని సమాధానం.

"అంటే? మీకు బి. ఎస్‌సి. కి ఫుల్ ఫామ్ ఏమిటో తెలుసా?"

"మీకు బి. ఇ. కి ఫుల్‌ఫామ్ ఏమిటో తెలుసా?"

"మొత్తానికి గట్టివారే" తేలిగ్గా నవ్వేశాడు రమేష్.

గట్టిదాన్నో, మెత్తనిదాన్నో? మీకెలా తెలుసు? అయినా నన్నెప్పుడు ముట్టుకు చూశారు.

## జె. శారద

"ఆమాత్రం దానికి ముట్టుకు చూడాలా? మిమ్మల్ని చూస్తే తెలియడంలా" అన్నాడు రమేష్.

"ఓహో అయితే యికనేం. మనిషిని చూసి మనిషి గుణగణాలు, మన స్తత్వం చెప్పేయ గలరన్నమాట. అయితే ఒక్క పొరపాటుచేశారు. మీరు బి. ఇ. కాక ఎం. బి. బి. ఎస్. చదవాల్సింది, బాగా రాణించేవారేమో?"

"ఏమో. మరి మీరే చెప్పాలి."

ఓ ఐదు నిమిషాలు నిశ్శబ్దంగా గడిచాయి. ఇటు పరంధామయ్యగారు, పార్వతమ్మ రజని తీరుకి ఒకటే కంగారు పడుతున్నారు.

ఇక అటువైపునుంచి మళ్ళీ ప్రశ్నలేమీ రాకపోవడంతో రజని వుండబట్టలేక,

"ఇంకా ఏమన్నా అడగాలా? అన్నట్టు హోమ్ సైన్సు గురించి ఏమీ అడగలేదే? మర్చిపోయారు కాబోలు" అంది రజని.

"ఇందాకనే చెప్పానుగా? మిమ్మల్ని చూస్తుంటేనే తెలుస్తోందిగా అన్ని విద్యలలో ప్రావీణ్యతగలవారని. అన్నట్టు ఒక్క విషయం. ఈ యింటర్వ్యూ గురించి



మీ అభిప్రాయం ఏమిటి ? ఐ మీన్ టు సే యిది సక్సెస్ ఫుల్ అవుతుందా ? కాదా?" అడిగాడు రమేష్ నవ్వుతూ.

"దటీజ్ వెరీ సింపుల్. మీ రడిగిన దానికి అన్నీ సెడపరంగా జవాబులందాయి కాబట్టి మీరు ఈ సంబంధానికి ఛస్తే ఒప్పుకోరు. "పిల్ల ఉత్త సెంకిఘటం బాబూ" అంటారు మా నాన్నగారితో. ఒకవేళ మీరు ఒప్పుకుందా మనుకున్నా మీ నాన్నగారు ఒప్పుకోరు. కాబట్టి, ఇది సక్సెస్ ఫుల్ కాదు" అంది నిర్భయంగా రజని.

పుల్ల విరిచినట్టు చెప్పిన రజని సమాధానానికి రమేష్ క్షణంసేపు ఆశ్చర్యపోయి, వెంటనే తేరుకుని "వెరీ గుడ్ ! చక్కగా చెప్పారు. మీ అభిప్రాయాన్ని" అన్నాడు రమేష్ చిరునవ్వుతో.

"ఏం? మీ అభిప్రాయమంటున్నారు ? అలా జరగదనా మీ ఉద్దేశం" అంది రజని.

"ఏమో? అది అంత త్వరగా ఎలా తేలుతుంది. కొంత టైము కావాలిగా? ఇక మీరేమన్నా అడగాలా" అడిగాడు రమేష్.

"ఊహూ" లేదన్నట్టు తల అడ్డంగా ఊగించింది రజని. "అయితే మీరిక వెళ్ళవచ్చు" అన్నాడు రమేష్.

"థాంక్స్" అని రెండు చేతులూ జోడించి నమస్కరించి వెళ్ళిపోయింది రజని.

అమ్మాయికి ఒంట్లో బాగుండలేదు. కాని పిల్ల చాలా బుద్ధిమంతురాలు మీరు మరోలా భావించకండి! అంటూ ప్రాధేయపడ్డారు పరంధామయ్యగారు రమేష్ తండ్రి నుద్దేశించి.

రమేష్ తండ్రి రమేష్‌వంక చూశాడు, ఏమిటీ దీనికి నీ సమాధాన మన్నట్టు.

"ఆ, దానిదేముందిలెండి. మీరు మరేం బాధపడనవసరంలేదు. వెళ్ళగానే జాబు వ్రాస్తాము." అన్నాడు రమేష్.

పెళ్ళివారిని వీధిదాకా సాగనంపి వేళ్ళాడిన ముఖంతో కుర్చీలో చేరబడ్డారు పరంధామయ్యగారు.

రజని మాత్రం సంతోషంగా ఉంది.

"తన కసలు ఇప్పుడప్పుడే పెళ్ళి చేసుకోవడం ఇష్టంలేదు. ఆ సంగతే తండ్రితో చెపితే వినలేదు మర్నాడు తనని చూడానికి వస్తున్నారంటే కాదనలేకపోయింది. తాను అందుకనే తగిన శాస్తి చేయాలనుకుని, ఆ విధంగా ప్రవర్తించింది తను. అంతే గాని తనకు మర్యాద తెలియకనా ? ఏమైనా నా పాచిక పారింది. వాళ్ళెలాగూ ఈ సంబంధానికి ఒప్పుకోరు." అనుకుంది రజని.

నాలుగు రోజులు గడిచాయి. పరంధామయ్యగారు మాత్రం చక్కటి సంబంధం తప్పిపోతుందేమోనని దిగులుగా గడిపారు. ఈ నాల్గు రోజులూ.

"పోస్ట్!" అన్న కేకతో ఒక్కసారి వీధిలోకి వెళ్ళి కవరందుకున్నారు పరంధామయ్యగారు. అడ్రసు (ఫ్రమ్ అడ్రసు) చూడగానే ఆయన ఖంగారు మరీ ఎక్కువైంది. కవరుచింపి గబగబా పైకి చదివారు. బావగారికి,

ఉభయ కుశలోపరి. మీ అమ్మాయి రజని మాకు అన్ని విధాలా నచ్చింది. ముఖ్యంగా మా అబ్బాయికి మీ అమ్మాయితో జరిగిన యింటర్వ్యూ ఎంతో నచ్చిందట అలాంటి అమ్మాయి కోసమే తాను చూస్తున్నానని మా వాడు అన్నాడు. కనుక మీకు కూడా ఈ సంబంధం విషయంలో అభ్యంతరం లేకపోయిన పక్షమున, వీలయినంత త్వరలో మంచిరోజు చూచుకొని ముహూర్తము నిర్ణయించుకొనుటకు రావలసింది. ఇంతే సంగతులు

ఇట్లు,
మీ బావగారు
సోమయాజులు.

సంతోషంతో ఉక్కిరిబిక్కిరి అయి ఒక క్షణం పాటు నోటమాట రాక, వెంటనే తేరుకుని "ఏమేవ్, మన అమ్మాయికి సంబంధం...... అంటూ ఓ గావుకేక పెట్టి లోపలికి పరిగెత్తారు పరంధామయ్యగారు.

చాటుగా తండ్రి చదివిన ఉత్తరం విన్న రజని ముఖం తెల్లగా పాలిపోయింది. అంతగా వాదించిన ఆ పెళ్ళికొడుకుకి తన ముఖం మళ్ళీ ఎలా చూపాలదు? అలాగని చక్కని సంబంధం వద్దన గలదా? అమ్మో, ఇంకేమైనా ఉందా? తనలోని మార్పుకు తానే ఆశ్చర్య పోయింది ఒక్కసారిగా, సిగ్గు ముంచుకు వచ్చింది. గబగబా ముఖాన్ని రెండు చేతులతో దాచుకుని గదిలోకి పరుగెత్తింది, రజని. ●



తామరకొలను ఫోటో: ఆర్. వి. యస్. మణి